వామ్మో... పెయిన్‌రోడ్డు!

- రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో నిత్య ఇబ్బందులు
- పేరుకే నో పార్కింగ్ బోర్డులు
- అనధికారికంగా సెంట్రల్ పార్కింగ్ వ్యవస్థ
- 30 అడుగుల నుంచి 12 అడుగులకు చిక్కిపోయిన వైనం
- యథేచ్ఛగా ఆక్రమణలు.. పట్టని నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం
- తోపుడు బండ్ల వ్యాపారులతో పోటీ పడుతున్న పెద్ద వ్యాపారులు
- అధికారులు చర్యలు చేపట్టాలని నగర ప్రజల విజ్ఞప్తి



అనధికార పార్కింగ్‌తో ఇరుకుగా మారిన మెయిన్‌రోడ్డు



నామమాత్రంగా నో పార్కింగ్ బోర్డులు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో కొనుగోలుదారులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండటంతో నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెయిన్‌రోడ్డు వ్యాపారుల ఆక్రమణలతో బక్క చిక్కి పోవడంతో 30 అడుగుల వెడల్పు రోడ్డు 12 అడుగులకు కుచించుకుపోయింది. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాల పార్కింగ్ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇటీవల కాలంలో మెయిన్‌రోడ్డు ఆధునీకరణలో భాగంగా సుమారు కోటి రూపాయలతో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే చాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తుల మేరకు లైటింగ్ ఏర్పాటు చేసిన కొద్ది కాలానికి తొలగింపు చర్యలు చేపట్టారు. లైటింగ్ ఉన్నంతకాలం ఇబ్బందులు పడిన వ్యాపారులు, నగర ప్రజలు, కొనుగోలుదారులు లైటింగ్ తొలగించిన తర్వాత అదే ప్రాంతంలో ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంతో మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. లైటింగ్ తొలగించిన రోడ్డు మధ్యలో ద్విచక్ర వాహనాలను అనధికార పార్కింగ్ చేస్తున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉంది.

పాదచారులకు అవస్థలు

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకే ప్రధాన వ్యాపార కేంద్రం కావడంతో నిత్యం వేలాదిమంది రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్‌లో బంగారు వస్తువులు, వస్త్రాలు, నిత్యావసరాలు, ఫ్యాన్సీ వివిధ రకాలు వస్తువులు కొనుగోలుకు తరలివస్తుంటారు.రోడ్ ఇరు వైపులా పార్కింగ్‌తో పాటు అనధికార పార్కింగ్‌తో మెయిన్‌రోడ్‌లో నడిచేందుకు సైతం దారి కరువవడంతో పాదచారులు తీవ్ర వ్యవస్థ పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మెయిన్‌రోడ్డులో వ్యాపారాలు సాగించే ప్రధాన షాపుల నిర్వాహకులు తమ షాపులను వదలి రోడ్డును ఆక్రమించే ప్రయత్నం చేపట్టారు. సుమారు ఐదు అడుగుల మేర రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. అదే సమయంలో తోపుడు బండ్ల వ్యాపారులు సైతం మెయిన్‌రోడ్డులో వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య మెయిన్‌రోడ్డుకు రావాలంటేనే ఇబ్బందిగా తయారైందని నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో వాహనాలను పార్కింగ్ చేయవద్దంటూ నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన బోర్డులు కేవలం ప్రకటనకు మాత్రమే పరిమితమయ్యాయి. వాటిని ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో అనధికార సెంట్రల్ పార్కింగ్ కొనసాగుతోంది.

తూతూ మంత్రంలా...

నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎప్పటికప్పుడు ఆక్రమణలు తొలగించే చర్యలు చేపట్టాల్సి ఉండగా తూతూ మంత్రంగా చర్యలు చేపట్టడం వల్లనే ఆ విధమైన పరిస్థితి నెలకొందని నగర ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. మెయిన్‌రోడ్‌లో కోటగుమ్మం సెంటర్ నుంచి శ్రీ కందుకూరి వీరేశలింగం పురమందిరం (టౌన్ హాల్ రోడ్) వరకూ రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ ఉన్నప్పటికీ సెంటర్ లైటింగ్ తీసివేసిన స్థానంలో ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అప్పుడప్పుడూ టౌన్ ప్లానింగ్ అధికారులు దాడులు నిర్వహిస్తూ బోర్డులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని వ్యాపారులు ఏమాత్రం లక్ష్యపెట్టడం లేదు. బోర్డులు తొలగించిన మరుసటి రోజే కొత్త బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా పోలీస్ యంత్రాంగం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు సరిగా దృష్టి సారించకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న నగరంలో ప్రతిష్టాత్మక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ మెయిన్‌రోడ్డు వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై నగర ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వ్యాపారులతోపాటు తోపుడుబండ్ల వ్యాపారుల సైతం వ్యాపారాలు కొనసాగించడంతో మెయిన్ రోడ్డు మరీ రద్దీగా తయారైంది. అదే పర్వదినాలలో అయితే కనీసం నడవటానికి సైతం అవకాశం లేకుండా పోతోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు, నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మెయిన్ రోడ్డులో ఆక్రమణలు తొలగించడం, విచ్చలవిడి పార్కింగ్‌ను నియంత్రించడం వంటి చర్యలు చేపట్టాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నడవటానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది



మెయిన్‌రోడ్‌లో మూడు చోట్ల పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. నడవటానికి దారి ఉండటం లేదు. అధికారులు ఏ మాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. మెయిన్‌రోడ్డుకు వెళ్లి రావాలంటేనే ఇబ్బందిగా ఉంటోంది. ఏ పండగ వచ్చినా మెయిన్‌రోడ్డులో నడవాలంటేనే కష్టంగా ఉన్న పరిస్థితి. అధికారులు దృష్టి సారించి ఇబ్బందులు తొలగించాలి.

–బి.శివజ్యోతి, రాజమహేంద్రవరం

అధికారులు చర్యలు చేపట్టాలి



జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు, నగర ప్రజలు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్ అధికారులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టాలి. మహిళలు నడిచేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాదిమంది మహిళలు మెయిన్‌రోడ్డులో అవస్థలు పడుతున్నారు. వారి అవస్థలను సంబంధిత అధికారులు తీర్చే ప్రయత్నం చేపట్టాలి.

– జాగు సత్యనారాయణ(వంకాయల సత్తిబాబు) రాజమహేంద్రవరం

క్లుప్తంగా

ఘనంగా భూలోకమ్మ తీర్థ మహోత్సవం

కడియం: స్థానిక శ్రీ భూలోకమ్మతల్లి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ ప్రజలు తమ ఇలవేల్పుగా భావించే భూలోకమ్మ తల్లి తీర్థ మహోత్సవం ఏటా వైభవంగా నిర్వహిస్తారు. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో సంప్రదాయక కార్యక్రమాలకు మాత్రమే పరిమితమయ్యారు. చిన్నారుల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆడపడుచులు, గ్రామస్తులు పిల్లాపాపలతో విచ్చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చర్యలు తీసుకుంది.

ఆర్థిక సాయం అందజేత



ఆసుపత్రిలో చిన్నారి లాస్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న నాగేశ్వర్

కడియం: మండలంలోని వేమగిరి పరిధిలోని జక్కంపూడినగర్‌కు చెందిన లాస్య కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి వెళ్లి లాస్య తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఆసుపత్రి వైద్యులతో స్వయంగా మాట్లాడి, చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని, తాను అండగా ఉంటానని లాస్య కుటుంబానికి చందన భరోసా ఇచ్చారు.

హనుమాన్ జయంతికి ప్రత్యేక ఏర్పాట్లు

ధవళేశ్వరం: హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నామన్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల వీఆర్వో గోసాల చిన్నా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలడుగుల రాముపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. ముగ్గళ్ళ ర్యాంపు నుంచి ఇసుక తరలించకుండా వీఆర్వో చిన్నా, వీఆర్ఏలు మద్దాల దుర్గారావు, రాజేంద్రప్రసాద్ శనివారం విధులు నిర్వహించారు. అర్ధరాత్రి 2 గంటలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుని సీతానగరం పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా పాలడుగుల రాము అడ్డుకున్నాడు. కులం పేరుతో దూషించి, వీఆర్ఏను నిర్బంధించి ట్రాక్టర్‌ను అక్కడ నుంచి తీసుకువెళ్లిపోయాడు. వీఆర్వో చిన్నా ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాముపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చిత్రలేఖనంతో సృజనాత్మక శక్తి

రంగంపేట: చిత్రలేఖనంతో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందుతుందని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు ఆదివారం పంచతంత్ర నీతి కథలను బోధించారు. అనంతరం చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. విశ్రాంత ఇరిగేషన్ ఉద్యోగి పీవీ ప్రసాద్ విద్యార్థులుక తెలుగు శతక పద్యాలు నేర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణార్థం...

- వేసవి సెలవుల్లో బాలబాలికలకు శిక్షణ
- శ్రీరామకృష్ణ మఠంలో ముగిసిన శిక్షణ తరగతులు
- టెక్నికల్ కోర్సులతో పాటు మన సంప్రదాయ కోర్సులలో తర్ఫీదు



యోగాసనాలు ప్రదర్శిస్తూ..

సీటీఆర్ఐ: ధర్మం నాలుగు పాదాలపై నిలవాలంటే అందరూ ఉత్తమమైన ధర్మాన్ని ఆచారించాలని, అలా ఆచరించాలంటే మన సంస్కృతి, సంప్రదాయాలపై మనకు సరైన అవగాహన ఉండాలని శ్రీరామకృష్ణ మఠంలో బాలబాలికలకు బోధిస్తున్నారు. మన పవిత్ర సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. చిన్నతనం నుంచి మన సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండటమే కాకుండా వాటిని సక్రమంగా పాటించాలనే ఉద్దేశంతో ఏటా వేసవి సెలవులలో టెక్నికల్ కోర్సులతో పాటుగా వేద పారాయణం, భజనలు, భగవద్గీత, ధ్యానం, యోగసనాలు, సంగీతం, చిత్రలేఖనం, హస్తకళలు, మహాపురుషుల జీవిత కథలు, వ్యక్తిత్వ వికాసం వంటి వాటిలో చిన్నారులకు శిక్షణ అందిస్తున్నారు. దీనివల్ల చిన్నతనం నుంచే వారిలో పెద్దవారిని గౌరవించడం, క్రమశిక్షణ తప్పకుండా జీవించడం, ధర్మాన్ని పాటించడం వంటి మంచి అలవాట్లు అవుతాయని ఈ కోర్సులను నేర్పిస్తున్నారు. ఈ కోర్సులను నేర్చుకున్న విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత 23 శాతం పెరుగుతుందని ఒక పరిశోధనలో తేలింది.

184 మందికి శిక్షణ..

ఈ సంవత్సరం వేసవి శిక్షణ శిబిరంలో 184 మంది విద్యార్థులు వివిధ కోర్సులను నేర్చుకున్నారు. ప్రతి రోజూ ఉదయం 7.15 నుంచి 11 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించేవారు. ఏప్రిల్ 25వ తేదీన ప్రారంభమైన ఈ కోర్సులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలైన యోగా, సంగీతం, వివేకానంద జీవనగాథ, జానపద గీతం, స్వామి వివేకానంద కొటేషన్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్వామి పరిజ్ఞేయానందజీ, స్వామి వేదవిద్యానందజీ, స్వామి సేవ్యానందజీ, స్వామి ప్రజ్ఞానాధానందజీ, స్వామి అర్చనానందనజీ పాల్గొన్నారు.



హస్తకళలను నేర్చుకుంటున్న విద్యార్థులు



సంగీత సాధనలో ఇలా..

మూఢ నమ్మకాలపై అవగాహన

ప్రకాశం నగర్ : గ్రంథాలయం వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ఆదివారం స్థానిక సీతంపేట శాఖా గ్రంథాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేదిక సభ్యుడు ఎం.మల్లికార్జునరావు విద్యార్థులకు మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. మూఢ నమ్మకాలతో మోసపోవద్దని విద్యార్థులకు కథల రూపంలో వివరించారు. అనంతరం చిత్రలేఖనంలో వారికి నచ్చిన చిత్రం వేయించి విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వారి ప్రతిభను వెలికి తీసే విధంగా వారిని ప్రోత్సహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చీరలు, పండ్లు పంపిణీ

ప్రకాశం నగర్ : జిల్లా బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కస్తూరి భాయి వృద్ధాశ్రమంలో వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలో జారి పడడంతో కాలు విరిగిన మహాలక్ష్మి అనే వృద్ధురాలికి ఆర్థిక సహాయం అందించారు. వృద్ధులకు చీరలు, మామిడి పండ్లు పంపిణీచేశారు. సంఘం అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కలగ సుబ్రహ్మణ్యం, జిల్లా మహిళా అధ్యక్షురాలు యేచూరి ప్రసన్న, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో యువత



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు వచ్చిన సందర్శకులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న నగర ప్రజలు

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాపీ స్ట్రీట్‌లో సందర్శకుల రాకతో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. నగరంలో పరమహంస యోగానంద మార్గ్ రోడ్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ నిర్వహించే హ్యాపీ స్ట్రీట్‌లో చిన్నారులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున హాజరై ఆనందోత్సాహాలతో గడిపారు. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడలను, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయగా చిన్నారులు యువత ఉత్సాహంగా పాల్గొని డ్యాన్సులతో మైమరిపించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమానికి హాజరైన 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మధురపూడి: 1994–95 సంవత్సరం కోరుకొండ ప్రభుత్వోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువకున్న విద్యార్థులు గత తీపి జ్ఞాపకాలను ఆదివారం నెమరువేసుకున్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి నాగసాయి ఫంక్షన్ హాలులో ఆదివారం వారి ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మండల కేంద్రమైన కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్‌లో 1994 –95 సంవత్సరంలో వీరంతా 10వ తరగతి, 1996–97 సంవత్సరంలో రాజుబాబు జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన వీరంతా చిన్ననాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తెలుగుమాస్టారి బోధనలు, ఇంగ్లిషు హోమ్‌వర్క్‌లో వచ్చిన పొరపాట్లకుగాను మాస్టారిచ్చిన పనిష్‌మెంట్ గురించి మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు సైతం పాల్గొన్నారు. అలనాటి విద్యార్థుల బ్యాచ్‌లో ఢిల్లీ ఎయిమ్స్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కోటికేశవరం గ్రామానికి చెందిన బర్రే విజయప్రసాద్ సమావేశానికి హాజరయ్యారు. కాగా ఇదే బ్యాచ్‌కు చెందిన రాజానగరం మండలం నందరాడకు చెందిన రత్నం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే ఎన్నికల కారణంగా ఆయన హాజరుకాలేదు. ఈ బ్యాచ్‌లోని చాలామంది వ్యాపారస్తులు, రెవెన్యూ, వివిధ శాఖల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారు. వీరంతా నాటి సంగతులను గుర్తుచేయడంతో పాటు, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పద్యాలు, పాటల ఆలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బొండాడ మధు, నాగ శేషగిరి, సత్తార్, మర్ల సీతారమశాస్త్రి, నక్కా ఆనంద్, పైడిమళ్ల నరసింహారావు పాల్గొన్నారు.

గాయపడ్డ నేతలకు పరామర్శ



సూర్యనారాయణను పరామర్శిస్తున్న మంత్రి వేణు

కడియం: మండలంలోని మురమండ గ్రామానికి చెందిన చేనేత నాయకులు యర్రా సూర్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై, చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ ఆదివారం మురమండలోని సూర్యనారాయణ స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మంత్రి వెంట రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మురమండ సొసైటీ చైర్మన్ ఈదర దీనదయాళ్, స్థానిక నాయకులు ఐనవిల్లి వేంకటేశ్వరరావు, ఊటుకూరి శైలజ, తోకల వీరవెంకట్రావు, టేకి శ్రీనివాసరావు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

రాజానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 18 రోజులుగా జరుగుతున్న సురేంద్ర మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. హోం గార్డుగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన తమ మిత్రుడు సురేంద్ర స్మృతిగా అతని మిత్రులు బషీర్, ఎం.సతీష్, ఎం.శివనాగు, కుమార్ ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలలో విన్నర్‌గా నిలిచిన రాయవరం జట్టుకు ట్రోఫీతోపాటు రూ.30 వేల నగదును అందజేశారు. తరువాత స్థానాలలో నిలిచిన జగ్గంపేట జట్టుకు రూ.15 వేలు, రాజానగరం జట్టుకు రూ.8 వేలు, గాడాల జట్టుకు రూ.4 వేలు నగదుతో పాటు బహుమతులను రియల్ ఎస్టేట్ వ్యాపారి దూలం గోపి అందజేశారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

చెట్టుపై నుంచి పడి సెంట్రల్ జైలు ఖైదీకి తీవ్ర గాయాలు

పరిస్థితి విషమం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో చెట్టుపై నుంచి ఖైదీ పడి తీవ్ర గాయాల పాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి జైలు సూపరింటెండెంట్ రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం...ఓపెన్ ఎయిర్ జైలులో చింతారావు అనే ఖైదీ చెట్టుపైకి ఎక్కి కొమ్మలు నరుకుతున్నాడు. ఆ సమయంలో చెట్టు కొమ్మ విరిగిపడి కిందపడిపోయాడు. దీంతో అతని తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. జైలు ఆసుపత్రిలో చికిత్స అందించిన అనంతరం అతనికి వాంతులు కావడంతో వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికంగా ఉన్న బొల్లినేని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు

అనపర్తి సీఐ శివగణేష్ హెచ్చరిక



బలభద్రపురంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివగణేష్

బిక్కవోలు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదల రోజున ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అనపర్తి సీఐ శివగణేష్ హెచ్చరించారు. ఆదివారం బలభద్రపురం గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా పోలీసులు ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 26 మోటార్ బైక్‌లను సీజ్ చేశారు. దీంతో పాటు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 10 లిక్కర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అనపర్తి సీఐ శివగణేష్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే వరకూ గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ కొనసాగుతుందన్నారు. ఎన్నికల ఫలితాల విడుదల సందర్భంగా ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణానికి సహకరించాలన్నారు. ఎన్నికల తుది ఫలితాలు వచ్చేవరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళికి అనుగుణంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఫలితాల అనంతరం బాణసంచా కాల్చు, ఊరేగింపులు వంటివి నిర్వహించడానికి వీల్లేదన్నారు. ఎన్నికల నిబంధనలను ఏ ఒక్కరు అతిక్రమించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తమ సంబంధం లేని బయటి వ్యక్తులకు ఆశ్రయం కల్పించడం నేరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.బుజ్జిబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	: లవ్‌మీ
సూర్యమినీ	: సిల్క్‌శారీ,డర్టీఫెలో
సూర్యప్యాలెస్	: ప్యూరియోసా
స్వామి	: కృష్ణమ్మ
శివజ్యోతి	: లవ్‌మీ
అనుశ్రీ	: ప్యూరియోసా
రాజా	: ప్యూరియోసా
ఊర్వశి	: బాక్
రంభ	: ఆఒక్కటీఅడక్కు
మేనక	: ప్రసన్నవదనం
అప్సర	: ప్యూరియోసా
కుమారి	: రాజుయాదవ్
నామవరం	
వివిఎస్.మహల్	: లవ్‌మీ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: లవ్‌మీ